క్లుప్తంగా

ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యంపై మంత్రికి ఫిర్యాదు



మంత్రి రాంప్రసాదరెడ్డికి వినతిపత్రం సమర్పించిన బీజేపీ నాయకులు

చక్రాయపేట : రాయచోటి–వేంపల్లెల మధ్యన బస్సులు తిప్పడంలో నిర్లక్ష్యం వహిస్తున్న రాయచోటి డిపో అధికారుల వైఖరిపై రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రాంప్రసాదరెడ్డికి ఫిర్యాదు చేసినట్లు బీజేపీ నేషనల్ కౌన్సిల్ భ్యుడు రామచంద్రారెడ్డి తెలిపారు. రాయచోటి–వేంపల్లె మార్గంలో నడుస్తున్న బస్సులు అన్నీ ఒకే సారి గొలుసుకట్టుగా వెళుతున్నందున ప్రయాణీకులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అధికారులు బస్సుకు బస్సుకు కనీసం 20 నిముషాల వ్యవధి ఇచ్చి నడిపితే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

ఉపాధి కూలీలకు పనిదినాలు కల్పించాలి

జమ్మలమడుగు : ఉపాధి హామీ కూలీలకు 120 రోజుల పనిదినాలను కల్పించాలని సీపీఎం పార్టీ నియోజకవర్గ కార్యదర్శి ఏసుదాసు కోరారు. శుక్రవారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం, రాష్ట్రంలోనీ ఎన్డీఏ ప్రభుత్వం ఉపాధి హామీ కూలీలకు పనిదినాలను కల్పించేవిధంగా భరోసా కల్పించి వారికి పది వారాలనుంచి రావలసిన బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. చంద్రబాబునాయుడు ఉపాధి కూలీలకు రోజుకు నాలుగు వందల రూపాయలు కూలి పడేవిధంగా పని కల్పించడంతోపాటు పనిముట్లు సైతం ప్రభుత్వమే ఇస్తుందని ప్రకటించారు. వెంటనే ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల ప్రజలకు పనికల్పించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

భాగవత పఠనం



భాగవత పఠనం నిర్వహిస్తున్న భక్త సమాజం సభ్యులు

సింహాద్రిపురం : కసునూరు గ్రామంలోని శివాలయంలో రెండవరోజు శుక్రవారం భాగవత పఠనం కొనసాగింది. పులివెందుల భాగవత భక్త సమాజం వారు నిర్వహించిన భాగవత పఠనం గ్రామస్థుల సహాయ సహకారాలతో నిర్వహించారు.

టీటీడీ దేవస్థాన భూముల కౌలుకు వేలం

జమ్మలమడుగు రూరల్ : టీటీడీ శ్రీ నారాపుర వెంకటేశ్వరస్వామి దేవస్థానం భూములు కౌలుకు జూలై నెల 4వ తేదీ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భూమి స్వాధీనం చేసుకున్న నాటి నుంచి 3 సంవత్సరాల వరకు మాత్రమే కౌలుకు ఇవ్వడం జరుగుతుందన్నారు. కౌలుకు తీసుకునే రైతులు టీటీడీ తిరుమల తిరుపతి దేవస్థానంనకు డీడీలు పంపించి వేలంలో పాల్గొనాలన్నారు. వివరాలకు ఆలయ అధికారులను సంప్రదించాలన్నారు.

మంటలు ఆర్పే విధానంపై మాక్ డ్రిల్

కడప అర్బన్ : ఏజీ అండ్ పీ సిటీ గ్యాస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో లెవెల్–2 మాక్‌డ్రిల్ కార్యక్రమం నిర్వహించినట్లు కడప అసిస్టెంట్ జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బసివిరెడ్డి, రిమ్స్ ఏఎస్ఐ యోగా రాయల్ తెలియజేశారు. కడప నగర శివారులోని ఐడీఏ పుట్లంపల్లి ఎల్‌సీఎన్‌జీ ప్లాంట్‌లో ఈ సందర్భంగా సీఎన్‌జీ ఫిల్లింగ్ పోస్ట్‌లో మంటలు వ్యాపించడంతో సైరన్ మోగడం వల్ల సిబ్బంది అప్రమత్తమై మంటలను ఆర్పివేసే సన్నివేశాన్ని ప్రదర్శిస్తారు.

30న సాహిత్య సదస్సు

కడప కల్చరల్ : యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ స్మారక గ్రంథాలయంలో ఈ నెల 30వ తేదిన ఉదయం 10 గంటలకు నెలనెల సీమ సాహిత్య సదస్సు నిర్వహించనున్నట్లు సంస్థ సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాదరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా రాయలసీమ నదీ సాహిత్యం రెండవ భాగం గురించి గ్రౌండ్ వాటర్ అండ్ వాటర్‌ఆడిట్ డిపార్టుమెంట్ విశ్రాంత సంచాలకులు ఎ.వరప్రసాద్‌రావు ప్రసంగిస్తారన్నారు.

క్రమపద్ధతి విధులతో ఒత్తిడి దూరం

వైవీయూ : అధ్యాపకులు క్రమపద్ధతిలో విధు లు నిర్వర్తిస్తే ఒత్తిడి దూరం అవుతుందని అనంతపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర అధ్యాపకుడు డి.లక్ష్మీనరసింహప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో ఐక్యూఏసీ ఆ ధ్వర్యంలో 'స్ట్రెస్ మేనేజ్‌మెంట్'పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఏదో ఒక రకంగా ఒత్తి డి ఎదుర్కొంటూనే ఉంటారన్నారు. తల్లిగర్భం మొదలు జీవితకాలం ఒత్తిడి ఉంటుందని, అ యితే చేసే పనిని ఇష్టపూర్వకంగా చేయడం ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవచ్చని సూచించా రు. చేసే పనిలో సమన్వయం పాటిస్తూ, కొంత విరామం తీసుకోవడం ద్వారా ఒత్తిడిని జయించవచ్చన్నారు.

నేటి నుంచి కోగటం ఉరుసు

కమలాపురం : మండల పరిధిలోని కోగటం గ్రామంలో వెలసిన హజరత్ సయ్యద్ షా ఆలంపీర్ ఖుద్దిససిర్రహు వారి ఉరుసు కార్యక్రమాలు శనివారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం గంధం, ఆదివారం ఉరుసు మహోత్సవాలను కీ.శే. గండ్లూరు పెద్ద వీరారెడ్డి కుటుంబ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం రాత్రి లక్ష్మయ్య శెట్టి వారి ఇంటి నుంచి గంధోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. పకీర్ల మేళతాళాలతో, పూల చాందిని అలంకరణలో గంధోత్సవాన్ని పుర వీధులలో నిర్వహించి అనంతరం దర్గాలోని స్వామి మజార్‌పై ఎక్కిస్తామన్నారు. భక్తులు విరివిగా పాల్గొని గంధోత్సవాన్ని జయప్రదం చేయాలని నిర్వాహకులు తెలిపారు.

30న ఉరుసు : ఈనెల 30వ తేదీన సయ్యద్ షా ఆలంపీర్ ఉరుసు మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాత్రి 9 గంటలకు మోపూరి ఎల్లారెడ్డి ఇంటి నుంచి జెండా ఊరేగింపు నిర్వహిస్తామని వారు తెలిపారు. అనంతరం ఫ్రెండ్స్ ఆర్కెస్ట్రా కడప వారిచే పాటకచేరి నిర్వహించనున్నారు. అనంతరం జి.వీర ప్రతాప్‌రెడ్డి (హైద్రాబాబ్) ఆధ్వర్యంలో గొప్ప ఖవ్వాలీ పోటీ నిర్వహించనున్నారు. ఆగ్రాకు చెందిన ఖాసిం హనీఫ్ సాబ్రి, నాగ్‌పూర్‌కు చెందిన మొహిసిన్ చిష్టి ఖవ్వాల్‌ల మధ్య ఖవ్వాలీ పోటీ నిర్వహించనున్నారు. అలాగే దర్గా పీఠాధిపతి సయ్యద్ షా తాహీర్ మొహిద్దీన్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించనున్నారు.



దర్గాలో వెలసిన స్వామి వారి మజార్

భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని నిర్వాహకులు తెలిపారు.



కోగటంలో వెలసిన హజరత్ సయ్యద్ షా ఆలంపీర్ దర్గా

అతిసార వ్యాధి నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి

వేంపల్లె : అతిసార వ్యాధి నివారణకు విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలని తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి స్వాతిసాయి తెలిపారు. శుక్రవారం ఆరోగ్య కేంద్రం పరిధిలోని వేంపల్లె–3 ఎస్సీ గర్ల్స్ హాస్టల్‌ను ఆమె సందర్శించి మాట్లాడారు. ముఖ్యంగా విద్యార్థులు అతిసార వ్యాధి వచ్చినప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రతీరోజు నీటిని కాచి చల్లార్చి తీసుకోవాలన్నారు. దోమల ద్వారా వచ్చే వ్యాధులు లక్షణాలు వ్యాధి వ్యాపించే విధానము, దోమలను అరికట్టే విధానం గురించి క్లుప్తంగా వివరించారు. ముఖ్యంగా విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత, చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. ఎవరికైనా ఆరోగ్య సమస్యలు వస్తే దగ్గర్లో ఉండే ఏఎన్ఎంకు లేదా ఆశాకార్యకర్తను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ షఫీఉన్నీసా బేగం, సీహెచ్ఓ వెంకటరత్నం, ఎంపీహెచ్ఓ బాబాఫక్రుద్దీన్, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

ఎర్రగుంట్ల : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యమైన భోజనం ఉండేలా చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దేరంగుల జగదీష్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని జెడ్పీ పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆయన సందర్శించి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లెక్చరర్ల కొరత ఉందని ప్రిన్సిపాల్ దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన ఆయన ఈ విషయాలను డీఈఓ, ఉన్నత విద్య అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

వేంపల్లె : ప్రతి రైతు విధిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని పులివెందుల వ్యవసాయ సహాయ సంచాలకులు ఏపీ నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని తాళ్లపల్లె రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 ఖరీఫ్‌కు సంబంధించి భూసార పరీక్షల ప్రాముఖ్యత గురించి రైతులకు వివరించారు. ప్రతి రైతు పంట వేయక మునుపే వారి యొక్క పొలాల్లో మట్టి నమూనాలను సేకరించాలని తెలిపారు. ఇలా మట్టి నమూనాలను సేకరించిన తర్వాత పది రోజుల్లో పరీక్ష ఫలితాలు అనుగుణంగా ఎరువులు మోతాదు వేసుకున్నట్లైతే రైతుకు అధిక దిగుబడితో పాటు ఖర్చులు కూడా తగ్గుతాయని వివరించారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి భూసార పరీక్షలు చేయించుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. నేలల్లో వాటిలోని సహజంగా ఉన్న పోషక పదార్థాలతో పాటు అదనంగా వేసిన సేంద్రీయ, రసాయనిక ఎరువుల్లోని పోషకాలను మొక్కలకు అందజేసి పంట దిగుబడికి దోహదపడతాయన్నారు. కాబట్టి నేలల్లో ఉన్న భూసారాన్ని తరచూ తెలుసుకోవడం ఎంతో అవసరమన్నారు. ఎరువుల వాడకంలో అనవసరపు ఖర్చులు చేయకుండా భూసారాన్ని కాపాడుకుంటూ అధిక, సుస్థిర దిగుబడులను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజేంద్రప్రసాద్, ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



మట్టి నమూనా సేకరణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ సహాయ సంచాలకులు

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి

కమలాపురం : వర్షా కాలంలో అపరిశుభ్రత వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పరిసరాలు పరిశుభ్రత పాటించి రోగాలకు దూరం కావాలని కమలాపురం ప్రభుత్వ హోమియో వైద్యులు షాకీర్ హుసేన్ తెలిపారు. శుక్రవారం ఆయన న్యూస్‌లైన్ అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

ప్రశ్న: వర్షా కాలంలో ఎలాంటి రోగాలు వస్తాయి?

జవాబు: వర్షా కాలంలో తరుచుగా జలుబు, ఫ్లూ, మలేరియా, విరేచనాలు, టైఫాయిడ్, కామెర్లు, డెంగ్యూ, అలర్జి, చికెన్ గున్యా, ఆయాసం, శ్వాసకోశ వ్యాధులతో పాటు అన్ని రకాల వైరల్, ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు వస్తాయి.

ప్రశ్న: నీరు కలుషితం వలన వచ్చే వ్యాధులు ఏవైనా ఉన్నాయా?

జవాబు: నీరు కలుషితం వలన విరేచనాలు, జాండిస్, టైఫాయిడ్, మలేరియా తదితర వ్యాధులు వస్తాయి.

ప్రశ్న: ఈ వ్యాధుల లక్షణాలు ఎలా ఎంటాయి?

జవాబు: నీరు కలుషితం వలన వచ్చే వ్యాధుల్లో ముఖ్యంగా అలర్జీ అధిక శాతం మంది ప్రజల్లో వస్తుంది. వాతావరణంలోని మార్పు కారణంగా చల్లదనం తగలగానే దగ్గు, తుమ్ములు, ఆయాసం, ముక్కుల్లో కంద పెరగడం, శ్వాస ఆడకపోవడం జరుగుతుంది. మలేరియా వస్తే చలి జ్వరం, విడుస్తూ, వదుల్తూ వస్తుంది. డెంగ్యూ సోకితే అధిక ఉష్ణోగ్రత, తలనొప్పి, కడుపు నొప్పి లాంటి లక్షణాలు ఉంటాయి. టైఫాయిడ్ వస్తే జ్వరం ఎక్కువగా ఉండదు. ఉష్ణోగ్రత కంటిన్యూగా ఉంటుంది. విడవకుండా జ్వరం ఉంటుంది. వాంతులు అవుతాయి. ఫంగల్ ఇన్‌ఫెక్షన్ల వలన చంకలు, గజ్జల్లో తామర లాంటి ఇన్‌ఫెక్షన్ ఉంటుంది. ఎలాంటి జ్వరం వచ్చిన లేట్ చేయకుండా ముందుగా డాక్టర్లను సంప్రదించి వైద్య సేవలు పొందండి.



షాకీర్ హుసేన్, ప్రభుత్వ హోమియో వైద్యులు, కమలాపురం

ప్రశ్న: రోగాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి

జవాబు: రోగాలు దరి చేరకుండా ముఖ్యంగా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఇంటితో పాటు పరిసరాల్లో, వాడిపడేసిన టెంకాయలు, టైర్లలో నీరు నిలువ ఉంచకుండా చూసుకోవాలి. నీరు నిలువ ఉంటే దోమలు చేరి లార్వా ఉత్పత్తి అయ్యే అవకాశాలు ఉంటాయి. కాబట్టి ప్రతి ఒక్కరు చిన్న పాటి జాగ్రత్తలు పాటించి రోగాలకు దూరం కావాలి.

ప్రశ్న: సీజనల్ వ్యాధులు ప్రబల కుండా మీరు ఏలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: సీజనల్ వ్యాధులు ప్రబల కుండా ముందస్తుగా పాఠశాలలు, కళాశాలల్లో ఇప్పటికే మందులు పంపిణీ చేశాము. రోగాలు దరి చేరకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను, సూచనలను విద్యార్థులకు వివరించాము. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించాము.

ప్రశ్న: హోమియో వైద్యంలో ఎలాంటి రోగాలకు వైద్య సేవలు ఉన్నాయి?

జవాబు: అన్ని రకాల జబ్బులకు హోమియోలో అద్భుత చికిత్సలు ఉన్నాయి. మలేరియా, డెంగ్యూ, చికెన్ గన్యా తదితర ప్రాణాంతక వ్యాధులతో పాటు దీర్ఘకాలిక వ్యాధులైన మోకాళ్ల, నడుము, వెన్నెముక నొప్పులు తదితర అన్ని రకాల రోగాలకు హోమియోలో వైద్య సేవలు ఉన్నాయి. అన్ని రకాల జబ్బులు కలిగిన వారు తమ ఆసుపత్రికి వచ్చి వైద్య సేవలు పొందవచ్చని ఆయన వివరించారు.

ఘనంగా పుట్టకోనమ్మ ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో పుట్టకోనమ్మ అమ్మవారు



గ్రామోత్సవంలో మహిళల కోలాటం

వేముల : మండలంలోని వి.కొత్తపల్లె గ్రామంలో శ్రీ పుట్టకోనమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామస్తులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పుట్టకోనమ్మ అమ్మవారును గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు చేసిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ఎర్రగుంట్ల : మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ భవనంలో నిర్వహిస్తున్నట్లు కమిషనర్ రామకృష్ణయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎం. హర్షవర్ధన్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు. కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు తప్పకుండా హాజరు కావాలని ఆయన కోరారు.

డ్రైనేజీలలో పూడికలు తీయండి



దొండపాడు రస్తాలో మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న ప్రజలు

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధిలోని దొండపాడు రస్తాలోని డ్రైనేజీలలో పూడికలు తీయాలని ఆ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం దొండపాడు రస్తా కాలనీలో మున్సిపల్ కమిషనర్ రామకృష్ణయ్య, జనసేన పార్టీ నియోజకవర్గ కో–ఆర్డీనేటర్ దేరంగుల జగదీష్‌లు పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలు మాట్లాడుతూ డ్రైనేజీలలో పూడికలు తీయకపోవడంతో దుర్వాసనతో దొమలు అధికంగా ఉన్నాయన్నారు.

బడి బయట పిల్లలు బడిలో ఉండాలి

చెన్నూరు : మండలంలోని ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, జిల్లా పరిషత్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల విద్యాశాఖ అధికారి గంగిరెడ్డి సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, విద్యార్థులకు బోధన విధానం అనే విషయాలపై దీక్ష యాప్‌లో అప్లోడ్ చేయాలని తెలిపారు. మండల విద్యాశాఖ అధికారి–2 సునీత, జిల్లా అకడమిక్ అధికారి రామాంజనేయరెడ్డిలు మాట్లాడుతూ నేను బడికి పోతా అనే కార్యక్రమంలో బడి బయట పిల్లలను బడిలో చేర్పించాలని, దీనిపై ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమ్యూనిటీ మొబైల్ అధికారి దశరదరామిరెడ్డి, ఏఎల్ఎస్‌సీ విశ్వనాథరెడ్డి, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ గంగిరెడ్డి

అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్

లింగాల : మండలంలోని రామన్నూతనపల్లె గ్రామంలో శుక్రవారం గ్రామ సర్పంచ్ లక్ష్మిరజిని నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. రూ.5 లక్షలు ఉపాధిహామీ నిధులు, రూ.5లక్షలు పాడా నిధులతో నిర్మించిన నూతన భవనాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ మంజుల, వైఎస్సార్సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

పింఛన్‌లు ఇటివద్దనే పంపిణీ చేయాలి

ఎర్రగుంట్ల : ఒకటవ తేదీన పింఛన్ దారులందరికీ అయా సచివాలయ ఉద్యోగులు వారి కేటాయించిన ఏరియాలలో ఉదయం నుంచే పింఛన్ డబ్బులు పంపిణీ చేయాలని ఎంపీడీఓ జాషువా, తహసల్దార్ సౌజన్యలక్ష్మి తెలిపారు. శుక్రవారం స్థానికి ఎంపీడీఓ సభ భవనంలో సచివాలయ ఉద్యోగులకు నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ పింఛన్ డబ్బులు పంపిణీలో అవకతవకలు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ ఈశ్వరయ్య, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లె : పెన్షన్‌లు పొందుతున్న లబ్ధిదారులకు జూలై 1వ తేదీ నుంచి ఇంటివద్దనే పెన్షన్ పంపిణీ చేయనున్నారని మండల అభివృద్ధి అధికారి పులిరామ్‌సింగ్ తెలిపారు. శుక్రవారం ఆయన తమ కార్యాయంలో విలేకరులతో మాట్లాడారు. 1వ తేదీ ఉదయం 6 గంటలకు సచివాలయ సిబ్బంది పెన్షన్‌దారుల ఇంటివద్దకు వెళ్లి పంపిణీ చేసే విధంగా ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయని తెలిపారు. మండలంలోని 15 సచివాలయాల పరిధిలో 5,202 మంది ఉన్నారన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ జాషువా

క్రీడాకారులకు రాయితీలు కల్పించాలి

కడప స్పోర్ట్స్ : రైల్వే, ఆర్టీసీ బస్సుల్లో క్రీడాకారులకు టోర్నమెంట్‌లకు వెళ్లే సమయంలో రాయితీలు కల్పించాలని వైఎస్ఆర్ కడప జిల్లా స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ నాయకులు కోరారు.

శుక్రవారం రాయచోటి పట్టణంలో రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రామప్రసాద్‌రెడ్డిని వారు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బి.శివశంకర్ రెడ్డి మాట్లాడుతూ యూజీ పీఈడీ డిగ్రీ అర్హత ఉన్న వ్యాయామ ఉపాధ్యాయులకు ఒక సంవత్సరం బ్రిడ్జి కోర్సు ఏర్పాటు చేసి వారికి కూడా స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించాలన్నారు. 250 మంది విద్యార్థులు పైగా ఉన్న ప్రతి ఉన్నత పాఠశాలకు అదనపు వ్యాయామ ఉపాధ్యాయ పోస్టును మంజూరు చేయాలన్నారు. 117 జీఓను రద్దు చేసి హైస్కూల్స్‌లో రద్దు చేసిన పీఈటీ పోస్టులను తిరిగి పునరుద్ధరించాలన్నారు. అప్పర్ ప్రైమరీ పాఠశాలలకు వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులను మంజూరు చేయాలన్నారు. కేజీబీవీ పాఠశాలల్లో పని చేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులకు మినిమం టైంస్కేల్ వర్తింపచేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, రామచంద్ర, జగదీశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తే అనర్థాలు

వైవీయూ : వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తే అనర్థాలు కలుగుతాయని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేమల సలీంబాషా పేర్కొన్నారు. శుక్రవారం కళాశాల అర్థశాస్త్ర విభాగం, ఐక్యూఏసీ విభాగం ఆధ్వర్యంలో ×వ్యవసాయంపై వాతావరణ మార్పుల ప్రభావాలు౯ అనే అంశంపై ఒక్కరోజు జాతీయ సదస్సు వర్చువల్ విధానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ దేశంలో అధిక జనాభా వ్యవసాయ రంగం మీదనే ఆధారపడి జీవిస్తున్నారని, కావున ఈ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తే అభివృద్ధి మందగిస్తుందన్నారు. వాతావరణంలో మార్పుల వల్ల వ్యవసాయ రంగం నష్టాల పాలవుతోందన్నారు. అనంతరం గూగుల్ మీట్ ద్వారా వైవీయూ అర్థశాస్త్ర ఆచార్యులు డాక్టర్ అనిత, తాడిపత్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు సి.అన్నపూర్ణ, నిజామాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ ఎ.ఆదెప్ప హాజరై సదస్సు గురించి ఉపన్యసించారు. ఆహారభద్రత, వ్యవసాయ సంక్షోభాన్ని అధిగమించేందుకు గల మార్గాలను వివరించారు. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్ డాక్టర్ జి.విజయలక్ష్మీదేవి, కో కన్వీనర్ డాక్టర్ సి.వి. కృష్ణవేణి, ఆర్గనైజింగ్ సెక్రటరీలు డాక్టర్ గురుమోహన్‌రెడ్డి, డాక్టర్ కె.శాలిని, డాక్టర్ పి. శచీదేవి, డాక్టర్ ప్రకాష్‌నారాయణరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వేమల సలీంబాషా

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

జమ్మలమడుగు : పట్టణంలోని రామిరెడ్డిపల్లె రహదారిలో ఉన్న న్యాక్ సెంటర్‌లో నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి వారికి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు న్యాక్ సెంటర్ ఇన్‌చార్జి చెన్నకేశవులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ కోసం దరఖాస్తులు చేసుకున్నవారికి మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తారన్నారు. అసిస్టెంట్ సర్వేయర్, ఎలక్ట్రీషియన్, టైలరింగ్, సీసీ కెమెరా టెక్నిషియన్‌లలో శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన వారు దరఖాస్తులు చేసుకోవచ్చు అన్నారు. అభ్యర్థులు 10వ తరగతి ఉత్తీర్ణత సాధించి 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలన్నారు. జూలై 9వ తేదీ లోపు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, సర్టి ఫికేట్, రెండు ఫొటోలతో న్యాక్ సెంటర్‌లో ఉన్న అధికారులను కలవాలన్నారు. వివరాలకు 97044 23051 నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవాలని సూచించారు.

నేడు గంగమ్మతల్లి వార్షికోత్సవం



ఏరువాక గంగమ్మతల్లి

ఎర్రగుంట్ల : పట్టణంలో వేలసిన ఏరువాక గంగమ్మ తల్లి 27వ వార్షికోత్సవానికి అన్ని ఏర్పాట్లను ఆలయ కమిటీ నిర్వాహకులు సిద్ధం చేశారు. శనివారం ఉదయం నుంచి వేడుకలు ఘనంగా జరగనున్నాయి. ఈ వేడుకలలో కోలాటం, భజనలు, ఊరేగింపులు, మహాగణపతి పూజ, కలశస్థాపన, అమ్మవారికి పంచామృత అభిషేకం, కుంకుమార్చన పూజలు జరుగనున్నాయి.

ఖాదర్‌బాషా పనితీరు ప్రశంసనీయం

చెన్నూరు : మండల తహసీల్దార్ కార్యాలయంలో సబార్డినేట్ ఖాదర్‌బాషా పనితీరు ప్రశంసనీయమని రెవెన్యూ ఉద్యోగులు కొనియాడారు. శుక్రవారం ఖాదర్‌బాష ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. ఆయన చెన్నూరు మండల తహసీల్దార్ కార్యాలయంతో పాటు కడప తహసిల్దార్, ఆర్డీఓ కార్యాలయాలలో సబార్డినేట్‌గా పని చేశారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రకాష్‌బాబు, డిప్యూటీ తహసీల్దార్ వెంకటరమణ, ఆర్ఐ సుగుణ, మండల సర్వేయర్ సోమశేఖర్‌రెడ్డి, పలువురు వీఆర్వోలు, వీఆర్ఏలు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ఖాదర్‌బాషాను సత్కరిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

సబ్జెక్టు ఉపాధ్యాయులను నియమించాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లావ్యాప్తంగా ఉన్నత పాఠశాలల్లో పని చేస్తూ ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన సబ్జెక్టు ఉపాధ్యాయుల స్థానంలో ఎస్‌జీటీలకు పదోన్నతులు కల్పించాలని, అప్పటి వరకు తాత్కాలిక పని సర్దుబాటు కింద ఉపాధ్యాయులను నియమించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ్‌కుమార్, పాలెం మహేష్ బాబు కోరారు. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత తీర్చాలని కోరుతూ శుక్రవారం యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో డీఈఓ మర్రెడ్డి అనురాధకి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల జిల్లాలోని వివిధ హైస్కూళ్లలో ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ పొందారన్నారు. ఈ కారణంగా పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై 15 రోజులు గడిచిందని, ఉద్యోగ విరమణ చేసిన వారి స్థానంలో ఉపాధ్యాయులను నియమించకపోవడంతో బోధన కుంటుపడుతోందన్నారు. ముఖ్యంగా 10వ తరగతి విద్యార్థులపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందన్నారు. ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరతను అధిగమించడానికి ఎస్‌జీటీలకు పదోన్నతులు కల్పించే వరకు తాత్కాలిక ప్రాతిపదికన సర్దుబాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రమణ, నాయకులు సురేష్‌కుమార్, గోపీనాథ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.